

ఉపాధి పనులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జగన్నాథపురంలో ఉపాధి పనులు కల్పించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథపురం గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనుల్లేక ఉపాధి హామీ పనుల కోసం ఎదురుచూస్తున్నారని, తక్షణం పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. బడ్జెట్‌లో రూ.రెండు లక్షల నలభై వేల కోట్లు కేటాయించాలని, ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.నాయుడు, వెంకటేశ్వరరావు, నాగభూషణం, చంద్రరావు, శ్రీను, వీర్రాజు, గంప సూరకరాజు పాల్గొన్నారు.

ఇలాగైతే పాఠాలు చెప్పేదెలా..!



తీవ్ర పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతం
బోధనేతర పనుల భారమే అధికం
ప్రతినెలా జీతాల కోసం ఎదురుచూపులు
తీవ్ర నిరాశ, నిస్పృహల్లో 12 వేల మంది ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర పని ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు. బోధన కంటే ఇతర పనుల భారం ఎక్కువ కావడంతో మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీతాల నుంచి మిగిలిన అన్ని సౌకర్యాల్లోనూ కోతలు విధిస్తున్నారు. చివరకు ప్రతి నెలా జీతాలకు సైతం రోజులు తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరు పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సుమారు 2500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సుమారు 12 వేల మంది వరకూ ఉపాధ్యాయులు ఉన్నారు. బోధన కంటే ఇతర పనుల భారం వీరిపై అధికం కావడంతో గత రెండు, మూడేళ్లుగా చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి బాధపడుతున్నారు. సమయానికి కనీసం జీతాలు కూడా సర్కారు ఇవ్వకపోవడంతో ఆర్థికంగానూ అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థులకు బోధన విషయంలో ఎంత ఒత్తిడైనా ఆనందంగా స్వీకరించే గురువులపై యాప్‌లు, జిఐఆర్‌లు, ముఖ గుర్తింపుతో అదనపు భారం పెంచేయడంతో కుంగిపోతున్నారు. ఉపాధ్యాయులకు అందించే జీతాల నుంచి అన్ని సౌకర్యాల్లోనూ ప్రభుత్వం విపరీతంగా కోతలు విధిస్తోంది. ఇంటి అద్దెలోనూ కోత వేశారు. ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఎ) కూడా 20 శాతం ఉంటే 16 శాతానికి, 15 శాతం ఉన్న వాళ్లకు 12 శాతానికి, 12 ఉన్న వాళ్లకు 10 శాతానికి తగ్గించారు. నగరాలు, మున్సిపాల్టీలు, గ్రామాల్లో పని చేసే వారందరికీ గతంలో ఉన్న హెచ్‌ఆర్‌ఎలో కోత వేశారు. ఉదాహరణకు రూ.15 వేల హెచ్‌ఆర్‌ఎ ఉంటే అది రూ.12,500కు తగ్గిపోయింది.

సెలవుల డబ్బులూ ఇవ్వట్లేదు

ఉపాధ్యాయులు ఇంతకుముందు సరెండర్ లీవులు చేసుకుని డబ్బులు మార్చుకునేవారు. అయితే ఉపాధ్యాయులకు గత ఏడాదిన్నర నుంచి సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్ మంజూరైనా ఖాతాల్లో మాత్రం డబ్బులు పడలేదు. (రూ.50 వేల జీతం ఉన్న ఉపాధ్యాయులు 15 రోజులు సరెండర్ లీవులు పెడితే రూ.25 వేల వరకూ డబ్బులొస్తాయి.) ఒక ఉపాధ్యాయుడికి జీతాన్ని బట్టి ఎన్ని రోజులు సెలవులు సరెండర్ చేస్తే అంత జీతం అదనంగా ఇస్తారు. ఇవేమీ పూర్తిస్థాయిలో వస్తున్న పరిస్థితి లేదు.

హాజరుకు అష్టకష్టాలు

ప్రస్తుతం ఉపాధ్యాయులకు వారి మొబైల్ ఫోన్లలోనే ముఖగుర్తింపు యాప్‌ను అప్‌లోడ్ చేశారు. అయితే ఉదయం, సాయంత్రం దీనిలో హాజరు వేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోంది. ఒకేసారి ఉపాధ్యాయులంతా హాజరు వేసుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కనీసం 20 నిమిషాలు ప్రయత్నిస్తేనే హాజరు పడుతోంది. ఏమాత్రం పడకపోయినా షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. పాఠశాల వదిలేసిన తర్వాత కూడా అక్కడే ఉండి హాజరు వేసుకుని వెళ్లేందుకు సెల్‌ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు.

యాప్‌లతో మరింత పని ఒత్తిడి

మధ్యాహ్న భోజనం యాప్‌లో ప్రతిరోజూ వండిన ఆహార పదార్థాలను ఉపాధ్యాయుని ఫొటోతో సహా అప్‌లోడ్ చేయాలి. గురువులకు ఇప్పుడు ఇదొక భారం. ఆహారం సరిగా లేకపోతే అప్‌లోడ్ చేసిన వాళ్లే బాధ్యులు. మరుగుదొడ్ల నిర్వహణ ఫండ్ (టిఎంఎస్) యాప్‌లో ప్రతిరోజూ పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఈ యాప్‌లో ఒక్కోసారి అంతా బాగున్నా బాగోలేదంటూ చూపిస్తోందని, షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు.

జీతాల కోసం రోజులు తరబడి ఎదురుచూపులు

వివిధ రకాల పనులతో సతమతమవుతూ పని భారంతో నెలంతా పని చేస్తున్నా ప్రతినెలా ఇచ్చే జీతాల కోసం ఉపాధ్యాయులు రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రతి నెలా ఉత్పన్నమవుతోంది. ఆగస్టుకు సంబంధించిన జీతాలు సెప్టెంబరు 12వ తేదీ దాటినా పూర్తిస్థాయిలో పడలేదు. జూన్ 10వ తేదీతో ఉపాధ్యాయుల బదిలీలు ముగిశాయి. జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు, నాలుగు నెలలుగా జీతాలందలేదు.

పెంచాల్సింది.. తగ్గించడంతో..!

ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువ ఇచ్చిన ప్రభుత్వం ఇదేనంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. 27 శాతం, ఆపైన ఇవ్వాల్సిన ఫిట్‌మెంట్‌ను 22 శాతానికి తగ్గించారు. ఎప్పుడూ లేనిది పిఆర్‌సిలో జీతాలు పెరగకపోగా తగ్గాయి. నాలుగు శాతం వరకూ తగ్గించడంతో గురువులు ఆర్థికంగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలోని ఓ ఉపాధ్యాయునికి రూ.97 వేల జీతం వస్తుంటే అది పిఆర్‌సి తర్వాత రూ.83 వేలకు తగ్గిపోయింది. గతంలో ఎన్నడూ ఇలా జరిగింది లేదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా అవమానాలు

ఏడాదిగా ఉపాధ్యాయుల మీద ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయింది. ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించడం. నోట్స్, పాఠ్యపుస్తకాలు చూసి విద్యార్థులను ప్రశ్నలు అడగడం, ఎవరైనా సరిగా చెప్పలేకపోతే పిల్లల ముందే ఉపాధ్యాయులను అవమానించడం, వాటిని వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని వాపోతున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత తమపై ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదని, దానికోసం తాము ఎంత సమయమైనా కేటాయిస్తామని, అయితే ఇలా అవమానించడమే ఎక్కువ బాధగా ఉంటోందని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వాపోతున్నారు.

ప్రభుత్వ విధానాలతో సతమతం

జిఒ నెం.117తో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని సవరించారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను దగ్గర్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపేశారు. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోయింది. ఉన్న వారిపైనే ఒత్తిడి పెంచేసి పాఠాలు చెప్పించడం వల్ల రోజంతా ఎనిమిది పీరియడ్లు ఉంటే కనీసం ఏడు చెప్పాల్సి వస్తోంది. వారానికి గత ప్రభుత్వంలో 30 పీరియడ్ల వరకూ ఉండగా ప్రస్తుతం కనీసం 40 నుంచి 45కు పెరిగాయి. దీనివల్ల విద్యార్థుల నోట్స్ దిద్దడానికి, పాఠాలు చెప్పేందుకు సన్నద్ధమవ్వడానికి సమయం లేక అవస్థలు పడుతున్నామని గురువులు వాపోతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్, యాజ్ ఎ ఫారెన్ లాంగ్వేజ్) పేరుతో మూడో తరగతి నుంచి తొమ్మిది వరకూ ఆంగ్ల ఉపాధ్యాయులు వారానికి మూడు పీరియడ్లను అదనంగా చెప్పాల్సిన పరిస్థితి. దీంతో వారానికి 45 పీరియడ్లుపైనే బోధించాల్సి వస్తోంది. ఇంత భారమైనా అలాగే బోధిస్తున్నా ప్రభుత్వం మాత్రం కనీసం టోఫెల్‌కు సంబంధించి ప్రింటెడ్ మెటీరియల్, ఓ పుస్తకం కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. అంతా సామాజిక మాధ్యమం చూసే బోధించాలని చెబుతోందంటూ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎకెవి.రామభద్రం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. పనిభారం విపరీతంగా పెరిగింది. బోధనే కాకుండా అనేక రకాల పనులను ప్రభుత్వం చేయిస్తోంది. దీంతో ఉపాధ్యాయులు మానసికంగా కుంగిపోయి అనారోగ్యం బారిన పడుతున్నారు. కనీసం సమయానికి జీతాలిచ్చే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేదు. రకరకాల టెక్నికల్ సమస్యలు చూపించి జీతాలను నిలుపుదల చేయడం దారుణం. ప్రతి నెలా పదో తేదీ దాటిన తర్వాత జీతాలు రావడంతో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల రుణాలు, ఇఎంఐలు సమయానికి చెల్లించలేకపోవడంతో విపరీతంగా ఆర్థిక భారం పడుతోంది. ఇలా అనేక సమస్యలతో ఉపాధ్యాయులు సహవాసం చేస్తున్నారు. తక్షణం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

'స్పందన' అర్జీలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి అధికారులు పనిచేయాలని, స్పందన సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 252 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందనలో ప్రజలు అందజేసిన అర్జీలను వెంటనే పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పర్చాలని ఆదేశించారు. స్పందనలో ప్రజలు అందజేసిన అర్జీలపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మథూర్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె. మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ అప్పారావు పాల్గొన్నారు.

హిందీ మాధ్యమిక పరీక్షలో..

పెదతాడేపల్లి విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



గెడ్డం సుశాంత్

గత నెల 9, 10వ తేదీల్లో జరిగిన దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షల్లో తమ విద్యార్థి గెడ్డం సుశాంత్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 163 మంది ప్రాథమిక, 282 మంది మాధ్యమిక, 32 మంది రాష్ట్ర, ప్రవేశిక, ఏడుగురు రాష్ట్ర భాషా పరీక్షకు హాజరవ్వగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వారిలో గెడ్డం సుశాంత్ మాధ్యమిక పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుశాంత్‌ను డిసిఒ ఎన్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు ఎంవి.బాలాజీ, బి.శ్రీనివాసరావు, ఎన్.సంజీవరావు అభినందించారు.

నీట్ సూపర్ స్పెషలైజేషన్‌లో..

సిరిచందనకు 376వ ర్యాంకు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్



డాక్టర్ సిరి చందన

పాలకొల్లు మండలం గొల్లవానిచెరువు గ్రామానికి చెందిన డాక్టర్ సిరిచందన (ఎంబిబిఎస్, డిఎన్‌బి జనరల్ మెడిసిన్) ఆల్ ఇండియా నీట్ సూపర్ స్పెషలైజేషన్ ఫలితాల్లో 376 ర్యాంకు సాధించింది. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం పాలకొల్లులోని మాంటిస్సోరీ స్కూల్లో జరిగింది. ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య స్కూల్లో చదివి, శ్రీకాకుళంలోని జేమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో డిఎన్‌బి జనరల్ మెడిసిన్ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఉన్న మెడ్‌ప్లస్ ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవల జరిగిన నీట్ సూపర్ స్పెషలైజేషన్ పరీక్షల్లో సిరిచందన ఆల్ ఇండియాలో 376 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ స్పెషలైజేషన్లో భాగంగా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో కోర్సు పూర్తిచేసి పేదలకు వైద్యం అందించాలన్నదే తన ధ్యేయమన్నారు. సిరి చందన తండ్రి ముత్యాల శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. తల్లి సీతామహాలక్ష్మి గృహిణి. ర్యాంకు సాధించిన డాక్టర్ సిరి చందనను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌బి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, మాంటిసోరిస్ కరస్పాండెంట్ మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్ ఆమెను అభినందించారు.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ సర్దుబాటు ఛార్జీలు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ప్రజాబ్యాలెట్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ సభ్యులు కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడారు. గృహవిద్యుత్ వినియోగదారులపై రూ.1,400 కోట్లు, సర్దుబాటు పేరిట రూ.2,900 కోట్లు మొత్తంగా రూ.4,300 కోట్ల భారాన్ని పేద, మధ్యతరగతి ప్రజలపై మోపడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజానీకం నెత్తిన విద్యుత్ సంస్కరణలు అమలు పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక కుంగిపోతున్న రైతులు ఈ విద్యుత్ ఛార్జీలు భరించలేరని, నేటి సంక్షోభ పరిస్థితుల్లో రైతులకు, పేదలకు తగిన సహాయం చేసి ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై భారాలు మోపడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. తక్షణం ప్రజలపై వేస్తున్న విద్యుత్ ఛార్జీలు



తాడేపల్లిగూడెం: ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్న నేతలు

తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకా రాజు, యడవల్లి వెంకన్న, అల్లం రాము, రావూరి బాబీ, గొబ్బెల ధనరాజు, గాలి శివ పాల్గొన్నారు.

పెంటపాడు : పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యాన ప్రజా సంఘాల కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణ్ రావు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం 2020లో విద్యుత్ సవరణ చట్టం తీసుకొచ్చిందని, ఆ చట్టాన్ని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పార్లమెంట్‌లో బలపర్చిందని తెలిపారు. ఆ బిల్లును బిజెపి పరిపాలిస్తున్న రాష్ట్రంలో కూడా వ్యతిరేకించినా మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాల వల్ల ఛార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. 2014లో వాడుకున్న కరెంటుకు యూనిట్‌కు 20 పైసలు చొప్పున 2021లో మే లో వాడిన విద్యుత్ యూనిట్‌కు మరో 20 పైసలు, 2023లో ఏప్రిల్ లో వాడుతున్న కరెంటు యూనిట్‌కు 40 పైసలు చొప్పున మొత్తం యూనిట్‌కు 80 పైసలు వినియోగదారులపై భారం పడుతోందని తెలిపారు. మరలా ఇప్పుడు ప్రతి ఇంటికీ, షాపులకు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్‌కు సుమారు రూ.13 వేలు ఖర్చవుతుందని, ఈ డబ్బులు ఒకేసారి కట్టాలంటే జనం తిరగబడతారని, ప్రతినెలా కరెంట్ బిల్లుతోపాటు 150 రూపాయలు పది సంవత్సరాలు పాటు వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బర్ల బాలాజీ, బండారు శ్రీను పెనగంటి దుర్గ, పడాల నాగేశ్వరరావు, కర్రి రామ శివారెడ్డి, కె.వెంకటేష్, చింతాడి ఫ్రాన్సిస్, దిద్దె నాగేశ్వరరావు, మర్లపూడి జాన్ పాల్గొన్నారు.

యువతలో సేవా దృక్పథం పెంపొందించాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాసన మండలి ఛైర్మన్ మోషేనురాజు

యువతలో సేవా దృక్పథం పెంపొందించే కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ముద్రించిన స్పెషల్ సావనీర్‌ను మోషేనురాజు తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కృషి చేస్తోందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాల రిక్రూట్మెంట్ విషయంలో ఉద్యోగ అర్హత కలిగిన వారికి వయోపరిమితి పెంచడం అభినందనీయమన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పి.వాసు, రాపాక రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన వస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణం మున్సిపల్ పరిధిలో 9, 13, 14, 15 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను వలవలవారి వీధి సచివాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదల కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన వస్తోందన్నారు. సుమారు 1,500 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వారికి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో రూ.2 కోట్ల పైబడి అధునాతన సబ్ సెంటర్ నిర్మించినట్లు తెలిపారు. పెద్దాసుపత్రిని 100 పడకలకు అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, బర్రె శంకర్ పాల్గొన్నారు.

గోడౌన్లలో ఇవిఎంల తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలు జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం గోడౌన్‌లో భద్రపర్చిన ఇవిఎంలను కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి రామ్‌సుందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి అవసరమైన ఇవిఎంలను నేటి నుండి సుమారు 40 రోజులపాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. సాంకేతిక లోపం ఉన్న వాటిని పక్కనపెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ ఇది అని తెలిపారు. బెంగుళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజినీర్ల నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని, గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని, సీసీ కెమెరాల నిఘా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇవిఎంల ఎఫ్ఎల్‌సి సూపర్‌వైజర్, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఎఫ్ఎస్‌సి ఇన్‌ఛార్జి నరసింహారావు, ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి - వీరవాసరం

సార్వా ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల అధ్యక్షుడు తాళ్లూరి హరిరామ్‌లక్ష్మణ్ అధ్యక్షతన యుటిఎఫ్ కార్యాలయం వద్ద రైతు సదస్సు సోమవారం జరిగింది. ఈ సదస్సు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచింది. సాధారణ రకం 75 కేజీల బస్తాకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.1,832కు ఆదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 ప్రకటించి ఆ మొత్తం కలిపి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌బికెల కేంద్రాల వద్ద ఎంత తేమ శాతం వచ్చిందో అదే తేమ శాతానికి మిల్లు వద్ద కూడా వర్తింపజేయాలన్నారు. గోనె సంచులు ఆర్‌బికెల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. రైస్ మిల్లర్లు చేసే దోపిడీని అరికట్టడంలో అధికారులు దృష్టి సారించాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ఏమాత్రమూ గిట్టుబాటు కాదని విమర్శించారు. కొన్ని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధరకు తోడుగా రూ.ఐదు వందల నుంచి తొమ్మిది వందల బోనస్ ప్రకటించి ఆ మొత్తం రైతులకు గిట్టుబాటు ధర ప్రకటిస్తున్నారన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడిని తగ్గించడం, పురుగు మందుల పై ప్రభుత్వం పర్యవేక్షన లేకపోవడం వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. తెలుగు రైతు సంఘం నాయకులు పోశింశెట్టి శ్యామలరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన కోత మిషన్లు రైతులకు ఉపయోగించకుండా రైతులు అధిక ధరలు చెల్లించి వేరే కోత మిషన్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ కాలువ శివారు భూములకు నీటి ఎద్దడి వస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రైతుల ధాన్యం మిల్లుకు చేరిన వారం రోజుల్లో రైతు ఖాతాల్లో ఖర్చులతో సహా జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతుల మృత్యుంజయ, బాలం విజయకుమార్, సైదు గంగరాజు, ఆచంట కనకాచలం, యార్లగడ్డ వెంకట్రావు, తూటే మార్టిన్, లూథర్ ఏజర్ల, సాల్మన్‌రాజు, బొర్రా ఆలమహారాజు పాల్గొన్నారు.




తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు

సిద్ధాపురం రోడ్డులో చెత్తను తొలగించండి

పలు గ్రామాల ప్రజల ఆందోళన - స్పందనలో వినతి

ప్రజాశక్తి - ఆకివీడు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

స్థానిక సిద్ధాపురం రోడ్డులో చినకాపవరం డ్రెయిన్ వంతెన వద్ద చెత్త డంపింగ్ వెంటనే ఆపాలని ఆ రోడ్డు గుండా వెళ్లే ధర్మాపురం, సిద్ధాపురం, చిన్నమిల్లిపాడు, కాలింగ్‌గూడెం, రాజులపేట గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. సోమవారం ఆయా గ్రామాల ప్రజలు తహశీల్దార్ కార్యాలయం వద్ద కాసేపు ఆందోళన చేసి స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఇక్కడ చెత్త డంపింగ్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించలేకపోతున్నామని వాపోయారు. చెత్త ప్రభావంతో రోజుకు ఇద్దరు ముగ్గురు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాగే పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యాల పాలై ఇప్పటికే ఆసుపత్రి పాలయ్యారన్నారు. చెత్త వల్ల 30 అడుగుల వెడల్పు రోడ్డు 5 అడుగులు కూడా లేదని, రోడ్డంతా చెత్తతో నిండిపోయిందని వాపోయారు. తక్షణం ఆకివీడు నగర పంచాయతీ అక్కడ చెత్తను డంప్ చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ విజయలక్ష్మి స్పందిస్తూ నగర పంచాయతీ మేనేజర్‌ను పిలిచి పది రోజుల్లో చెత్త తొలగించాలని ఆదేశించారు.

విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన


స్తంభం సరిచేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని అబ్రహం పేటలో విద్యుత్ స్తంభం సమస్యను సోమవారం ఆ శాఖ అధికారులు పరిష్కరించారు. విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉండడంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖాధికారులు స్పందించారు. ఎలక్ట్రికల్ ఏఇ శివప్రసాద్ పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్ వేంద్ర పెద్దిరాజు పర్యవేక్షణలో సిబ్బంది విద్యుత్ స్తంభం సమస్య పరిష్కరించారు.

సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. మండలంలోని ఆరేడు గ్రామంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు పివిఎల్.నరసింహారాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపాటి రఘుపతిరాజు, చింతలపాటి రామాంజనేయరాజు, అల్లూరి రాంబాబు రాజు, గెద్దం భాగ్యరాజు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామక్షేత్రం పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు మండలంలోని లంకలకోడేరుకు చెందిన ముక్కు విజయకుమార్, రమాతారక దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళం ఇచ్చారు. వారిని దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఇఒ. యాళ్ల సూర్యనారాయణ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్ర పటం, బాండ్ పత్రం అందించారు.

టిడిపి తెలుగు యువత మండలాధ్యక్షులుగా రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల


రామరాజును అభినందిస్తున్న ఎంఎల్ఎ మంతెన

టిడిపి తెలుగు యువత కాళ్ల మండలాధ్యక్షులుగా జక్కరం గ్రామానికి చెందిన మంతెన రామరాజును ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు నియమించారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ రామరాజుకు, టిడిపి మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జక్కరం గ్రామంలో టిడిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

కులం పేరుతో దూషించారని

ఉపసర్పంచిపై సర్పంచి ఫిర్యాదు

ప్రజాశక్తి - వీరవాసరం

నవుదురు ఉపసర్పంచి బొట్టా మునీంద్రరావుపై ఆ గ్రామ సర్పంచి నల్లిమెల్లి వేణుక సోమవారం భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన తనను ఉప సర్పంచి బొట్టా మునీంద్రరావు కులం పేరుతో దూషిస్తూ అభ్యంతరకరంగా ప్రవర్తించినట్లు వేణుక ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేకుండా తనతో బలవంతంగా సంతకాలు చేయిస్తూ నిర్ణయం చేయిస్తున్నాడని తెలిపారు. ఈ నెల 3వ తేదీన గ్రామ పంచాయతీ సమావేశంలో తన ప్రమేయం లేకుండా గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు పెంచమని తనతో బలవంతంగా సంతకాలు చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. "నేను మద్దతు తెలపడం వల్లే నీవు సర్పంచిగా ఉన్నావంటూ" కించపరుస్తూ ఉపసర్పంచి మాట్లాడారని వేణుక ఫిర్యాదు చేశారు. ఇదే విధంగా వార్డు సభ్యులు మల్లుల రామలక్ష్మి, కరింశెట్టి వెంకటలక్ష్మిలు కూడా తనను అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'స్పందన'కు 16 ఫిర్యాదులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో ఎస్‌పి యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 16 ఫిర్యాదులు అందాయి. కట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదలపై ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు.

రైతులకు మేలు చేసింది వైఎస్ కుటుంబమే : గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

రైతులకు మేలు చేసింది కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబమేనని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయకుదురు సొసైటీకి సంబంధించిన రైతులకు రూ.39 లక్షలను డివిడెండ్స్, వడ్డీ రాయితీ రూపంలో పంపిణీ చేసే కార్యక్రమం సోమవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ కీర్తిశేషులు రాజశేఖర్‌రెడ్డి ఆనాడు పాదయాత్ర చేసిన సమయంలో రైతుల కష్టాలను, ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారన్నారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సిఎం జగన్ రైతులను ఆదుకోవడంలో తండ్రి బాటలో నడుస్తున్నారని తెలిపారు. అనంతరం చింతలకోటి గరువులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి పర్యవేక్షించారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు.

ముగిసిన తపాలా వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోస్ట్‌మెన్ సేవలు అద్వితీయమని, తపాల శాఖలో పోస్ట్ మెన్ పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత తపాల శాఖ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అల్లు సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పోస్టల్ శాఖ చాలా కీలకమన్నారు. అవినీతికి చోటులేని ఈ శాఖలో పోస్ట్ మెన్ల సేవలు ముఖ్యమైనవన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్ట్‌మెన్ కోసం ఎదురుచూసే కాలం ప్రస్తుతం లేదని, సెల్‌ఫోన్స్, వెబ్ సైట్లు వచ్చిన తరువాత పోస్ట్‌మెన్ విలువలు తెలియడం లేదన్నారు. 14 మంది పోస్టల్ ఉద్యోగులను, ఉత్తమ పోస్ట్‌మెన్లను ఘనంగా సత్కరించారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి యువకుడు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు ఆసుపత్రులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం పేరుపాలెం బీచ్‌కి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అర్ధరాత్రి తిరిగి వెళ్తుండగా మోడీ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని స్థానికులు అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ముగ్గురిలో పరిస్థితి విషమించి ఉడుం నాగేశ్వరరావు (27) మృతి చెందాడు. నాగేశ్వరరావు సోదరుడు రాజారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ పరిధిలో లజపతిరాయ్‌పేట రెండో వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ చెప్పారు. దీనికి సంబంధించి పొన్నాడ కోటేశ్వరరావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు డిటి చెప్పారు. పాలకొల్లు విఆర్ఒ సుబ్బరాజు సమక్షంలో పంచానామా జరిపినట్లు ఆయన చెప్పారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకారం అందించాలి

జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు


గణపవరంలో...

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లిఖార్జునరావు కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహ రహిత భారతదేశం, బాలల భద్రతే భారత్ భద్రత నినాదంతో జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా పంచాయతీ అధికారి బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారించేందుకు గ్రామస్థాయి నుంచి కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ మెంబరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట : బాల్య వివాహాలను రూపుమాపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసిందని, అందుకు అనుగుణంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొడమంచిలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గోవర్ధన్, ఎంఎల్‌హెచ్‌పిలు రూప, రాశి, ఎఎన్ఎంలు డి.పుష్పరాజ్యం, వెంకటరమణ పాల్గొన్నారు.

గణపవరం :బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశిపాడు మహిళ సంరక్షరాలు భానుప్రియ అన్నారు. మండలంలోని కాశిపాడులో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్‌డి.రామారావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, వైసిపి నాయకులు సిల్వర్ స్టార్ రాజు, ఆశాలు కృష్ణకుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు :బాల్య వివాహాలను నిషేధించడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడిఒ శ్రీవాణి అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద స్పందన కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ శాఖల మండల అధికారులు, పట్టణ అధికారులతో ఐసిడిఎస్ అధికారి నిర్మల ప్రతిజ్ఞ చేయించారు.

కాళ్ల : బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని, బాలికల రక్షణ, సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదేనని అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి అన్నారు. పెదఅమిరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలికలకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బడి పిల్లలు బయట ఉండకూడదు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

ఐదు నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్నవారంతా తప్పని సరిగా బడిలో ఉండాలని, ఏ ఒక్కరూ బయట ఉండకూడదని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బొండాడపేట, దొడ్డనపూడి గ్రామ సచివాలయాల్లో గ్రాస్ ఎన్రోల్‌మెంటు రేషియో యాప్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. విద్యాశాఖ సర్వే చేసిన సిఆర్ యాప్‌ను, సచివాలయ వాలంటీర్లు సర్వే చేసిన బిఏపి యాప్‌ను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మానవ అభివృద్ధిని సూచించే అంశాల్లో విద్య, వైద్యం కీలకపాత్ర పోషిస్తాయన్నారు. జిఇఆర్ నూరు శాతం లేని చోట్ల పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చదువుకోవడంవల్ల మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రతి గడపకు వెళ్లి వారికి అవగాహన కల్పించాలని వాలంటీర్లకు సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకూ విద్యార్థుల డేటాను ఒకే చోట లభ్యమయ్యేలా ప్రక్రియ చేపట్టడం వల్ల మనకు సహాయపడుతుందన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా వారు కోరుకున్న శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎంపిడిఒ డాక్టర్ జి.స్వాతి, ఆర్ఐ లక్ష్మీకిరణ్, సచివాలయ, రెవిన్యూ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా భీమవరం పట్టణాభివృద్ధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సోమవారం పలు అభివృద్ధి పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. తొలుత పట్టణంలోని ఆరో వార్డులో రూ.38 లక్షల నిధులతో అల్లూరి సీతారామరాజు విగ్రహం ప్రాంతంలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం ఇదే వార్డులో రూ.28.50 లక్షల నిధులతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సిఎస్ఎన్ కాలేజీ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. పట్టణంలో ప్రతి వార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అంతేకాకుండా రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలను మరింతగా మెరుగుపరిచినట్లు చెప్పారు. వార్డుల్లో శివారు ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో భీమవరం పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, సిఎస్ఎన్ కళాశాల కరస్పాండెంట్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్ పాలన : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సిఎం జగన్ పాలన ఉందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. మండలంలోని మహదేవపట్నం గ్రామ సచివాలయ పరిధిలోని రామచంద్రపురంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పివిఎల్ నరసింహారాజు మాట్లాడుతూ అర్హులందరికీ పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు పివిఎల్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన పివిఎల్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా దిశా యాప్

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలకు దిశా యాప్ రక్షణగా ఉంటుందని సిఐ కెవివిఎన్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశాయాప్, నేర నివారణ, సాంఘిక మాధ్యమాలు, మాదకద్రవ్యాల నివారణ అంశాలపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలందరూ దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ విద్యార్థులు నేర ప్రవృత్తి వైపు వెళ్లకుండా నేరాలు నివారించేందుకు సహకరించే క్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని మహిళా సాధికారిక, ఎన్ఎస్ఎస్, యాంటీ ర్యాగింగ్ విభాగాల్లో పనిచేసే విద్యార్థులు పాల్గొన్నారు.

రజక చెరువులు అన్యాక్రాంతం కాకుండా పోరాటం

ఆచంట :జిల్లాలో రజకులకు ఎక్కడ అన్యాయం జరిగినా రజక సంఘం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దిపర్తి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రజక వృత్తిదారులకు రక్షణ చట్టం కల్పించాలని, రజక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు చెరువులపై పూర్తి హక్కు కల్పించాలన్నారు. రజక చెరువులు అన్యాక్రాంతం కాకుండా పోరాటానికి సంఘం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలోని రజక వృత్తిదారులందరూ చైతన్యవంతులై రజకుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దేవస్థానం భూముల కౌలుకు వేలం పాట

వీరవాసరం :వీరవాసరం గ్రూపు దేవస్థానాలైన వీరేశ్వర, విశ్వేశ్వర, వేణుగోపాల, సీతారామ, కనకదుర్గమ్మ దేవస్థానాలైన సాగు భూములు సార్వా సాగు చేసుకునేందుకు వేలం పాటను సోమవారం దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించారు. కోర్టు ఆదేశాలనుసారం దేవదాయ, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేలం పాటలో 2.80 ఎకరాల భూమిని నల్లిమెల్లి ఆశీర్వాదం రూ.27,500కు, 71 సెంట్ల భూమిని రూ.9,500 ముక్కు వెంకటేశ్వరావు, 32 సెంట్ల భూమిని మోగంటి వెంకటేశ్వరరావు రూ.4,500కు ఒక పంట నిమిత్తం దేవస్థానానికి కౌలు చెల్లించే విధంగా పాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పులగం వేణుగోపాలరావు, బివి.కృష్ణంరాజు, పిటి గోవిందు, దేవస్థానాల ఛైర్మన్లు పాలా నాగరాజు, కందుల సురేష్, యాళ్ల కృష్ణారావు, సిపిఎం నాయకులు బాలం విజయకుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాయితీపై రుణాలు అందించి ఫిష్ ఆంధ్ర మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కెపి.పాలెం నార్త్ పంచాయతీ పరిధి తూర్పు తాళ్లు సెంటర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మార్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ లబ్ధిదారులకు 40 శాతం, ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు 60 శాతం, బిసి మహిళలకు 60 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నామన్నారు . ఈ మార్ట్‌లలో అన్ని రకాల మత్స్య ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. మత్స్య ఉత్పత్తుల అమ్మకాల ద్వారా ఆ వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిర్వాహకురాలు మల్లిపూడి దుర్గాభవానితో అందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, సర్పంచి కడలి సోంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, బొక్క రాధాకృష్ణ, అంద్రజు చల్లారావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రక్షణగా 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజలంతా ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని రాజమండ్రి రుడా ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సోమవారం కొయ్యేటిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ ఫుడ్ రుచి చూశారు.

నరసాపురం టౌన్ : మండలంలోని రుస్తుంబాద గ్రామపంచాయతీ వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించారు. శిబిరంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు రక్తహీనత అధిగమించడానికి ఏర్పాటు చేసిన తినుబండారాలను పరిశీలించారు. తొలుత రుస్తుంబాద పంచాయతీ మండా వారిగరువులో రూ:7 లక్షలు జెడ్‌పి నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు.

ఉండి :ప్రజారోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలిచిందని ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ అన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి కమతం సౌజన్య బెనర్జీ మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారన్నారు.

కాళ్ల : సిఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుందని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఏలూరుపాడు హైస్కూలులో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన సందర్శించారు.

పోడూరు : ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలందించి ఆరోగ్యకర సమాజానికి కృషి చేస్తుందని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ అన్నారు. మండలంలోని మట్టపర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు.

టిడిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి : మంతెన రామరాజు


కాళ్ల : బాబుతో నేను ఇంటింటికి ప్రచారంలో ఎంఎల్ఎ మంతెన

ప్రజాశక్తి - కాళ్ల

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ ఇచ్చామని ప్రజలందరికీ ఇప్పుడు అర్థమైందని, ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైసిపిని ఇంటికి పంపడం ఖాయమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కాళ్ల గ్రామంలో బాబుతో నేను ఇంటింటికి ప్రచారం కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ చంద్రబాబుకు జైలులో కనీస సౌకర్యాలు కల్పించడంలేదని, బాబుకు ఏదైనా జరిగితే వైసిపి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బండారు వేణు గోపాలరావు, పార్టీ మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, టిడిపి కాళ్ల గ్రామ అధ్యక్షులు కొప్పినీడి గణపతి, పుప్పాల బుజ్జి, బరకాల శ్రీను, కె.చందు, వీరమల్లు సురేష్, చవ్వాకుల నాని, బండారు సోమేశ్వరరావు, బండారు నాని పాల్గొన్నారు.

వీరవాసరం :వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిందని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు బాబు వెంటే మేము అంటూ సోమవారం చంద్రబాబుకు మద్దతు తెలుపుతూ టిడిపి నాయకులు వీరవాసరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తూర్పు సెంటర్ వరకు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వీరవల్లి శ్రీనివాసరావు, చింత కనకయ్య, కడలి నెహ్రూ, పోశెంశెట్టి శ్యామలరావు, చింతపల్లి మాణిక్యాలరావు, ఆకుల బాలరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 34వ రోజు సోమవారం కొనసాగాయి. సోమవారం పట్టణ, మండల మహిళలు దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కర్నేన రోజారమణి మాట్లాడారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా పట్టణంలోని 26వ వార్డు వీవర్స్ కాలనీలో టిడిపి కుటుంబ సభ్యులు రాష్ట్రపతికి, గవర్నర్‌కు పోస్ట్ కార్డులు తపాలా ద్వారా పంపి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పులపర్తి సతీష్, పులపర్తి శ్రీధర్, సూరిబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన కరపత్రాల పంపిణీ, రచ్చబండ కార్యక్రమం భీమవరం పట్టణం 29వ వార్డు గొల్లవనితిప్పరోడ్ ప్రకాష్ నగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజ శ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA. No.222/2023
O.S. No.105/2023
మరియు
O.S. No.105/2023

Between :
ఉప్పల నాగేశ్వర రావు, తండ్రి : బాపిరాజు, హిందువు, వయస్సు 71 సం॥లు, డి.నెం.2-20, వేంకటేశ్వర స్వామి గుడి వద్ద, బువ్వన పల్లి, నిడమర్రు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...పిటీషనరు(వాది)

And

పెరుమాళ్ళ వెంకట ఫణీంద్ర కుమార్, తండ్రి : వేంకట విజయ రాఘవరావు, హిందువు, వయస్సు, 51 సం॥రాలు, బాలయ్య టాంకు వద్ద, గణపవరం, పశ్చిగోదావరి జిల్లా. ...రెస్పాండెంటు (వాది)

ఈ నెంబరు రెస్పాండెంటు మరియు దావాలోని ప్రతివాది అయిన పెరుమాళ్ళ వేంకట ఫణీంద్ర కుమార్ గార్కి ఎన్ని మార్లు శ్రీకోర్టు వారు నోటీసులు, సమన్లు పంపినను తీసికొనక Avaid చేయుచున్నందున నదరు రెస్పాండెంటు, ప్రతివాది **డి.27-10-2023న** పై కోర్టువారి ఎదుట స్వయము గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరుఅయి తమ ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో సదరు గ్రంధమున పరోక్షమున తీర్మానింపబడును.

శ్రీ పచ్చిగోళ్ళ సూర్యనారాయణ, B.A.,BL.,
అడ్వకేట్,
నిడదవోలు
6.10.2023 నిడదవోలు, సెల్: 98496 82517

ప్రకటన

మహారాజ శ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA. No.221/2023
O.S. No.108/2023
మరియు
O.S. No.108/2023

Between :
ఉప్పల నాగ వెంకట చంద్ర పుల్లేశ్వర రావు, తండ్రి : నాగేశ్వర రావు, హిందువు, వయస్సు 71 సం॥లు, డి.నెం.2-20, వేంకటేశ్వర స్వామి గుడి వద్ద, బువ్వన పల్లి, నిడమర్రు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...పిటీషనరు(వాది)

And

పెరుమాళ్ళ వెంకట ఫణీంద్ర కుమార్, తండ్రి : వేంకట విజయ రాఘవరావు, హిందువు, వయస్సు, 51 సం॥రాలు, బాలయ్య టాంకు వద్ద, గణపవరం, పశ్చిగోదావరి జిల్లా. ...రెస్పాండెంటు (వాది)

ఈ నెంబరు రెస్పాండెంటు మరియు దావాలోని ప్రతివాది అయిన పెరుమాళ్ళ వేంకట ఫణీంద్ర కుమార్ గార్కి ఎన్ని మార్లు శ్రీకోర్టు వారు నోటీసులు, సమన్లు పంపినను తీసికొనక Avaid చేయుచున్నందున నదరు రెస్పాండెంటు, ప్రతివాది పై కోర్టువారి ఎదుట **డి.27-10-2023న** హాజరు కాగలందులకు వాయిదా వేసినారు. కావున స్వయంగా గాని, వకీలు ద్వారా గాని వచ్చి మీ అభ్యంతరములు తెలుపుకోవలెను. కానిచో సదరు గ్రంధమున పరోక్షమున తీర్మానింపబడును.

శ్రీ పచ్చిగోళ్ళ సూర్యనారాయణ, B.A.,BL.,
అడ్వకేట్,
నిడదవోలు
6.10.2023 నిడదవోలు, సెల్: 98496 82517

గ్రంథాలయంలో శిక్షణ శిబిరం

నరసాపురం టౌన్ :నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఉమాపతిరావు పిల్లలకు టైం మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. నిర్దిష్టమైన ప్రణాళికతో లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని, ప్రణాళిక బద్ధమైన జీవన విధానం కొనసాగించాలని చెప్పారు. శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు సైన్స్ సందేహాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థి సాయిసూర్య పుట్టినరోజు సందర్భంగా కేకులు, స్వీట్లు పంచారు. ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులు పాల్గొనాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

మంత్రి కొట్టును కలిసిన ఆర్యవైశ్య సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం :ఉప ముఖ్యమంత్రి దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో తాడేపల్లిగూడెం శ్రీ వాసవి క్లబ్ ఆర్యవైశ్య సంఘ నాయకులు సోయవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచయతన క్షేత్రంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రిని ఆహ్వానించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు మండవెల్లి చెన్న నాగేంద్ర, గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు వబిలిశెట్టి నటరాజు, కొనకళ్ల హరినాథ్, మండా బ్రహ్మాజీ పాల్గొన్నారు.

దస్తావేజులు పడిపోయినవి

గుబ్బల నాగేశ్వరరావు, తండ్రి:నరసింహ మూర్తి అను నేను నా యొక్క ఒరిజినల్ క్రియ **దస్తావేజులు** నెం. **1508/2004,** తణుకు సబు రిజిస్ట్రారు ది.13-10-2023 శుక్రవారంన తణుకు మండలం, వేల్పూరు గ్రామ సెంటరులో జిరాక్సు తీయించుకుందామని చూచుకొనగా నా ఒరిజినల్ క్రియ దస్తావేజు కనబడలేదు. మార్గ మధ్యలో ఎంత వెతికినా దొరికలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

గుబ్బల నాగేశ్వరరావు
తండ్రి: నరసింహమూర్తి
వేల్పూరు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 98487 28289

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు 1వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టు క్లాసు తాడేపల్లిగూడెం
ఓ.ఎస్.నెం. 530/2022

బిట్వీన్:
మారిశెట్టి భాను ప్రకాష్ మూర్తి ...వాది
మరియు
కాటూరి సూర్యవతి మరియు ఇద్దరు ...ప్రతివాదులు

3వ ప్రతివాది: కాటూరి అమృత శ్రీ, తండ్రి: కాటూరి కటాక్ష కుమార్, వయస్సు 25 సం॥లు, ప్రైవేట్ ఎంప్లాయి, డో.నెం. 24-10-27, ఆర్.ఆర్.పేట, ఏలూరు, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో మీపై వాది కోర్టులో దావా వేసియున్నారు. పై నెంబరు దావాలోని సమన్లు ఉద్దేశ్యపూర్వకంగా కాటూరి అమృత శ్రీ Avoid చేసి యున్నారనియు శ్రీ కోర్టు వారు ది.18-10-2023 వ సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. **సదరు ది.18-10-2023వ తేదీన కోర్టులో ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను.** అట్లు హాజరు కాని ఎడల శ్రీ కోర్టు వారు చట్టప్రకారం మీ పరోక్షంగా తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొత్తపల్లి వీరవెంకట సత్యనారాయణ
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
15-10-23. సెల్: 94401 43195

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు 1వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టు క్లాసు తాడేపల్లిగూడెం
ఐ.ఎ.నెం. 263/2022
ఓ.ఎస్.నెం. 530/2022

బిట్వీన్:
మారిశెట్టి భాను ప్రకాష్ మూర్తి ...వాది
మరియు
కాటూరి సూర్యవతి మరియు ఇద్దరు ...ప్రతివాదులు

3వ ప్రతివాది: కాటూరి అమృత శ్రీ, తండ్రి: కాటూరి కటాక్ష కుమార్, వయస్సు 25 సం॥లు, ప్రైవేట్ ఎంప్లాయి, డో.నెం. 24-10-27, ఆర్.ఆర్.పేట, ఏలూరు, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో మీపై వాది కోర్టులో దావా వేసియున్నారు. పై నెంబరు దావాలోని నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా కాటూరి అమృత శ్రీ Avoid చేసి యున్నారనియు శ్రీ కోర్టు వారు ది.18-10-2023 వ సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. **సదరు ది.18-10-2023వ తేదీన కోర్టులో ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను.** అట్లు హాజరు కాని ఎడల శ్రీ కోర్టు వారు చట్టప్రకారం మీ పరోక్షంగా తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొత్తపల్లి వీరవెంకట సత్యనారాయణ
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
15-10-23. సెల్: 94401 43195

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 117/2014

Between:
Penmetsa Venkata Subba Lakshmi ***...Plaintiff***
AND
Penmetsa Satti Raju and Others ***...Defendants***

D-11: Penmetsa Aruna, D/o. Late Satti Raju, Hindu, Female, Age 29 Years, House Wife, R/o. Kommara, Attili Mandal, Tanuku JCJC.

వాది తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 11వ ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో కోర్టు ద్వారా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారుసమన్లు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలో పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో దావా విచారించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు, వాది తరపు అడ్వకేట్,
17-10-23. తణుకు, ప॥గో॥జిల్లా.